
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 13 సెప్టెంబరు 2024





హాజరని చెప్పి తీర్మానాలపై సంతకాలు తీసుకోవడంపై చర్చిస్తున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు

ధీమాలేని బీమా

వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి, తేమ ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు తరచూ నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడిన పంటలు కోల్పోతున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా అప్పుల పాలవుతున్న రైతులు చివరకు ఆయువు తీసుకుంటున్నారు. అన్నదాతలకు ఆర్థిక నష్టాలు, కష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకం ప్రవేశపెట్టింది. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో అందని ద్రాక్షగానే మారింది. రూ.వేలల్లో పెట్టుబడులు వర్షార్పణం అవుతుంటాయి. ఆ నష్టాల నుంచి కోలుకోవడం రైతులకు గగనంగా మారుతోంది. వాతావరణ ఆధారిత బీమా పథకం ద్వారా బాధిత రైతులకు పరిహారం అందించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రైతులకు ఈ పథకంపై అవగాహన కల్పించి, నమోదు చేయించాల్సిన వ్యవసాయ, ఉద్యాన, ప్లానింగ్ శాఖలు అంతులేని నిర్లక్ష్యంతో ఉన్నాయి. దీంతో రైతులు పంటలు కోల్పోతున్నా బీమా పరిహారం అందుకోలేకపోతున్నారు. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా అందుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.



- అందని ద్రాక్షగా వాతావరణ ఆధారిత బీమా
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతులేని నిర్లక్ష్యం
- పరిహారం అంశంలో దగాకు గురౌతున్న అన్నదాతలు
- అమలుపై పట్టీపట్టనట్లుగా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు
- వర్షపాతం ఆధారంగానే పరిహారమని రైతుల ప్రయోజనాలకు గండి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ నెలలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అతి భారీవర్షాలు కురిశాయి. వేల ఎకరాల్లోని పంటలు ముంపునకు గురయ్యాయి. ఇలాంటి పరిణామాలు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో ఏటా జరగడం సర్వసాధారణంగా మారుతుంటోంది. అయినా వాతావరణ ఆధారిత బీమా పథకం అందని ద్రాక్ష చందాన మారింది. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే పంటలు కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా వాతావరణ ఆధారిత బీమా పరిహారం అందించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు శూన్యం. సాధారణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్యత్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమా పథకం అలా ఉండదు. పంట వేసిన సమయంలో అధిక వర్షాలు కురిస్తే జరిగే నష్టాన్ని అంచనా వేస్తారు. ఇలా పంట వివిధ దశల్లో అధిక వర్షాలు, వర్షాభావం వల్ల కలిగే నష్టాన్ని నమోదు చేయాలి. ఈ పరిస్థితుల్లో వాతావరణ బీమా పథకం అమలు కాకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. పథకం లక్ష్యాలు ఘనంగా ఉన్నా పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. గత ఏడాది తీవ్ర వర్షాభావం.. భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పత్తి, మిరప పంటలను వాతావరణ ఆధారిత బీమా పథకంలో చేర్చారు. సదరు రైతులు సాగు చేసిన పత్తి, మిరప పంటలకు వాతావరణ బీమా అమలు అవుతోంది. ఆయా పంటలకు ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లిస్తోంది. వాతావరణ ఆధారిత బీమాలో బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు అర్హుడే. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరిహారం చెల్లిస్తారు.

సాధారణంకన్నా అధిక వర్షపాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గత నెల 31, ఈ నెల 1 తేదీల్లో సాధారణ వర్షపాతం 680.76 మీమీ కాగా 15,764.1 మీమీ నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అంటే సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాలు రైతులను కోలుకోలేని విధంగా నష్టపరిచాయి. మిరప, వరి, పత్తి, కంది పంటలకు అపార నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పరిహారం అందించాలి. రైతులకు సదరు పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంలో ఉద్యాన, ప్లానింగ్ శాఖలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. కుండపోత వర్షాలకు ఈ సారి కూడా వేలాది ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నా బాధిత రైతులకు బీమా ధీమా ఇచ్చే పరిస్థితులు కానరావడంలేదు. దీంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల వల్ల ఆయా పంటలకు జరిగిన నష్టానికి ఈ బీమా పథకం కింద పరిహారం అందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవనే చెప్పాలి. 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలకు మా త్రమే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. 31, 1 తేదీల్లో సాధారణం కన్నా వేల రెట్లు అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. పత్తి తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీనివల్ల దిగు బడులను కోల్పోయారు. నీటిలో నాని ఉరకెత్తి మొక్కలు ఎండిపోయి ఎకరా కు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడులను రైతులు కోల్పోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావరణ అధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు అధారంగా, పంట నష్టపరిహారం కోసం వ్యవసాయ శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. వ్యవసాయ స్పందించి రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలి. పల్నాడు జిల్లా పరిధిలోని 17 మండలాల్లో 23,317.5 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. 123 గ్రామాల పరిధిలో 9,006 మంది రైతులు నష్టపోయినట్లుగా గుర్తించారు. తుది నివేదికలో 21,212.5 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అయితే 33 శాతం నష్టం 6,930 ఎకరాల్లో వాటిల్లిందని 3,253 మంది రైతులు నష్టపోయినట్లు మాత్రమే నిర్ధారించారు. అయితే 9,006 రైతులందరికీ వాతావరణ ఆధారిత బీమా పరిహారం వచ్చే అవకాశం ఉన్నా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు స్పందిస్తున్న దాఖలాలు లేవు.

హాజరని చెప్పి.. తీర్మానాలపై సంతకాలు

- తోటి ఉద్యోగస్తులకు జీడీసీసీ అధికారుల బురిడీ
- ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు
- ఎదురు తిరిగిన సహకార శాఖ ఉద్యోగులు
- నకిలీ రుణాల రికవరీ ఊసెత్తని మహాజన సభ సమావేశం
- సొసైటీలకు మేలు చేసే అంశం ఒక్కటీ లేదని ఆరోపణలు
- ఇకపై విమానంలోనే సీఈవో అధికారిక పర్యటనలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 12 : గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) మహాజనసభ సమావేశంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో జీడీసీసీ అధికారులు తోటి ఉద్యోగస్తులను బురిడీ కొట్టించారు. హాజరు తీసుకుంటున్నామని చెప్పి ఏకంగా తీర్మానాలపై సంతకాలు తీసుకోవడం వివాదాస్పదమైంది. ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు తీసుకున్నారని సొసైటీలకు పర్సన్ ఇంచార్జి లుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు ఎదురు తిరగడంతో వ్యవహారం రచ్చకెక్కింది. తొలుత జీడీసీసీ బ్యాంకు 114వ వార్షిక నివేదికను, టేబుల్ అజెండా పత్రాలను సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలకు అందజేశారు. సమావేశానికి వచ్చిన వారి హాజరు తీసుకుంటున్నామని చెప్పి వారితో సంతకాలు తీసు కున్నారు. బ్యాంకు పర్సన్ ఇంచార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ వచ్చిన తరువాత సమావేశం ప్రారంభించారు. కొద్ది సేపు వార్షిక నివేదిక, టేబుల్ అజెండాపై అధికారులు మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సమావేశం ముగించి వెళ్లిపోయారు. ఆ తర్వాత సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు తీర్మాణం పుస్తకం కావాలని బ్యాంకు సీఈఓ కృష్ణవేణిని అడిగారు. అందుకు ఆమె సమాధానం దాటవేయడంతో ఉద్యోగులు ప్రత్యేకంగా సమావేశమై సభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను తాము ఆమోదించ బోమని రాత పూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ మహాజన సమావేశానికి సంబంధించిన తీర్మానాలు రాసేందుకు పుస్తకం లేదని సీఈఓ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత పెద్ద బ్యాంకులో తీర్మానాలను రాసే పద్ధతి లేదని చెప్పడం అందరినీ మోసగించడమేనని అన్నారు. ఈ సమావేశంలో జరిగిన తీర్మానాలకు తమకు ఏ విధమైన సంబంధం లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు.

స్వప్రయోజనాలు తప్ప....

జీడీసీసీ బ్యాంకు మహాజన సభ సమావేశంలో అక్కడ పనిచేస్తున్న అధికారుల ప్రయోజనాలు తప్ప మరేమీ లేవు. గత కొన్ని రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో జీడీసీసీ బ్యాంకులు వేదికగా అనేక కుంభకోణాలు జరిగాయి. ఈ సమావేశంలో వాటి తాలూకూ విచారణ నివేదికలను బయట పెడతారని,నకిలీ రుణాలను రికవరీ పై చర్చి స్తారని అందరూ భావించారు. కానీ, వాటి ప్రస్తావన లేకుండా నే సమావేశాన్ని 'మమ' అనిపించారు. రానున్న రోజుల్లో రైతు ప్రయోజనాలు ముడిపడిన సొసైటీలకు ఏమి మేలు చేస్తారన్న దానిపై కూడా చర్చ లేకుండానే సమావేశం ముగించారనే ఆరోపణలు వస్తు న్నాయి. జీడీసీసీలో పనిచేసే అధికారుల అలవెన్స్‌లు,ఇతర ప్రయోజనా లను అజెండాలో చేర్చి గుట్టుగా ఆమోదింపచేసుకున్నారు.

విమాన ప్రయాణం..

టేబుల్ అజెండాలో చేర్చిన మరో అంశం చర్చనీయాంశంగా మారింది. జీడీసీసీ సీఈఓ ఇకపై అధికారిక పర్యటన కోసం విమానంలో ప్రయాణించేందుకు వీలుగా తీర్మానం ప్రవేశపెట్టారు.రైల్లో ప్రయాణిస్తే సెకండ్ క్లాస్ ఏసీ, విమానం అయితే ఎకానమీ క్లాస్‌లో వెళ్ళేట్టుగా తీర్మానం పెట్టారు.టేబుల్ ఎజండా సబ్జెక్ట్ 6 లోని 2,3,4,5,6 అంశాలపై సొసైటీ పర్సన్ ఇంచార్జిలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త గా మూడు శాఖల ఏర్పాటు

జీడీసీసీ అదనంగా 21 శాఖలు ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపగా ఆర్‌బీఐ అందులో మూడింటికి పచ్చజెండా ఊపింది. పెదకాకాని, పెదనందిపాడు, ముట్లూరులో జీడీసీసీ బ్రాంచీలు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక నివేదికలో వెల్లడించారు. నికర లాభం రూ.21.94కోట్లు 2023-2024 సంవత్సరానికి గానూ బ్యాంకు నికర లాభం రూ. 21.94 కోట్ల ని నివేదికలో వెల్లడించారు.

మార్చి 29 వరకే ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవి

- నవంబరు 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

నరసరావుపేట, సెప్టెంబరు 12: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ లో భాగంగా పట్టభద్రులు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పట్టభద్రులకు ఓటు నమోదు దరఖాస్తుకు నవంబరు 6 చివరి తేదీగా నిర్ణయించింది. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. ఈ ప్రకారం ఓటర్ల జాబితా ముద్రణ నవంబరు 20, ముసాయిదా ఓటర్లజాబితా ప్రకటన 23, అభ్యంతరాల స్వీకరణ 23 నుంచి డిసెంబరు 9, ఓటర్ల తుది జాబితాను 30న ప్రకటించనున్నారు.

నష్టంపై నివేదిస్తాం

- బాధితులకు కేంద్ర బృందం హామీ
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన
- గుంటూరు చానల్‌తో పాటు మగ్గాల పరిశీలన
- గండ్లు కారణంగా పొలాలు మునుగుతున్నాయన్న రైతులు

తెనాలి రూరల్, మంగళగిరి సిటీ, తాడేపల్లి టౌన్/గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడం పూర్తయిన అనంతరం నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందిస్తాం. అన్ని విధాలా ఆదుకుంటాం. అధైర్యపడవద్దు.. అని కేంద్ర బృందం సభ్యులు వరద బాధితులకు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వాగ్‌మరే(నాగపూర్), ఆర్థిక శాఖ కన్సల్‌టెంట్ ఆర్పీ కౌల్ (ఢిల్లీ), గ్రామీణాభివృద్ధిశాఖ ఉపకార్యదర్శి ప్రదీప్‌కుమార్(ఢిల్లీ)తో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాలో పంట నష్టం అంచనా పరిశీలన చేపట్టింది. పెదకాకాని, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో ఈ బృందం పర్యటించింది. అంతకముందు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ని కేంద్ర బృందం పరిశీలించింది. శాఖల వారీగా జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యల గురించి కలెక్టర్ నాగలక్ష్మి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం పెదకాకాని మండల పరిధిలోని గుంటూరు ఛానల్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. తెనాలి మండలం హాఫ్‌పేట - కొలకలూరు గ్రామాల మధ్య దెబ్బతిన్న పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సాగుకు పెట్టిన పెట్టుబడుల గురించి రైతుల ద్వారా బృందంలోని అధికారులు తెలుసుకున్నారు. భారీ వర్షం కారణంగా పొలాల్లో నీరు చేరడంతో పాటు తుంగభద్ర డ్రెయిన్‌కు గండిపడటంతో పంటలు మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్నామని రైతులు చెప్పారు. కాల్వలకు గండ్లు పం డకుండా చర్యలు చేపట్టడంతో పాటు పంటలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి తెలిపి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

- కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం పాతమంగళగిరి దింపుడు కళ్లెం వద్ద వర్షాలకు దెబ్బతిన్న చేనేత మగ్గాలను పరిశీలించింది. పరిశ్రమకు జరిగిన నష్టాన్ని కలెక్టరు కేంద్ర బృందానికి వివరించారు. మగ్గం గుంతల్లోకి నీరు చేరడం వల్ల నూలు, చీరలు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి రూ.59.37 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు. తాడేపల్లిలోని మహానాడు కాలనీలో ముంపు వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర బృందంలోని సభ్యులు పరిశీలించారు. ఇళ్లలోకి వెళ్లి సామగ్రిని పరిశీలించారు.



మంగళగిరి: భారీ వర్షాలకు పాడైపోయిన చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెక్టర్ నాగలక్ష్మి



తెనాలి: పంటల నష్టం వివరాలను కేంద్ర బృందానికి తెలుపుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రూ.107.77 కోట్లు అవసరం

- కేంద్ర బృందానికి కలెక్టర్ నాగలక్ష్మి నివేదిక

జిల్లాలో వరద ముంపు వల్ల వ్యవసాయ, ఉద్యాన, చేనేత ఇతర రంగాలకు, మౌలిక సౌకర్యాలకు జరిగిన నష్టాలు, పునరావసం, సహాయక చర్యలకు రూ. 107.77 కోట్ల ఆర్థిక సహాయం అవసరమని కలెక్టర్ నాగలక్ష్మి కేంద్ర బృందానికి వివరించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర బృందానికి కలెక్టర్ వరద నష్టం నివేదిక అందజేశారు. అధిక వర్షపాతం, ఎగువ నుంచి కృష్ణా నదికి భారీగా వరద నీరు రావడంతో నదీ తీరంలోని లంక గ్రామాలను వరద ముంచెత్తిందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, మత్స్య, చేనేత రంగానికి అధిక మొత్తంలో నష్టం వాటిల్లిందని తెలిపారు. ముంపునకు గురై పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో గృహాలు, రహదారులు, చిరు వ్యాపారుల వస్తువులు దెబ్బతిన్నాయన్నారు. వరద ముంపులో పంటలు ఆరు రోజుల వరకు మునిగిపోయాయన్నారు. లంక గ్రామాలతో పాటు, పట్టణాల్లోని ముంపు ప్రాంతాల్లోని నివాసాల్లోకి పది నుంచి ఆరు అడుగుల వరకు నీరు చేరి రెండు నుంచి నాలుగు రోజుల వరకు నిల్వ ఉందన్నారు. తుళ్ళూరు, మంగళగిరి, కొల్లిపర మండలాల్లోని గ్రామాలు పూర్తిగా నీరు చేరటంతో పాటు, పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో వరద ముంపు వల్ల వ్యవసాయ పంటలు 29882 హెక్టార్లలో వరి, 2430 హెక్టార్లలో పత్తి, 688.6 హెక్టార్లలో మినుము, ఇతర పంటలు మొత్తం కలిపి 33210.6 హెక్టార్లలో నీట మునిగాయన్నారు. దీంతో 49961 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. అరటి, కురగాయలు, పసుపు, మిరప, బొప్పాయి, కంద తదితర పంటలు 4058.86 హెక్టార్లలో నీట మునిగాయని, 6030 మంది రైతులకు నష్టం జరిగిందన్నారు. పాలిచ్చే పశువులతో పాటు, మేకలు, గొర్రెలు, కోళ్ళు చనిపోవడంతో రూ.142 లక్షల నష్టం జరిగిందన్నారు. మత్స్యశాఖకు సంబంధించి వలలు పాడై రూ.9.50 లక్షల వరకు వాటిల్లిందన్నారు. నూలు, మగ్గాలు, ఇతర మెటీరియల్‌కు సంబంధించి రూ.59.37 లక్షల నష్టం జరిగిందన్నారు. గుంటూరు చానల్‌తో పాటు ఉన్న ఇతర మైనర్, కేడబ్ల్యూడీ కెనాల్స్ డ్రెయిన్లలో సామర్థ్యానికి మించి వరద నీరు ప్రవహించడం వల్ల 237 ప్రాంతాల్లో గండ్లు పడటంతోపాటు, షెట్టర్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.1272.84 లక్షలు ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు. రహదారులకు సంబంధించి 303.559 కి.మీ పాడైపోయాయని, దీనికి రూ.1651 లక్షలు అవసరం అవుతుందన్నారు. గుంటూరు నగరపాలక సంస్థకు రూ.2.24 కోట్లు, ఎంటీఎంసీకి రూ.11.36 కోట్లు నష్టం జరిగిందన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి పోల్స్, వైర్లు, ఇతర పరికరాలకు రూ.122.37 లక్షల నష్టం జరిగిందన్నారు. రెస్క్యూ, పునరావాసం కోసం రూ.354.67 లక్షలు అవసరం ఉందన్నారు. ఇళ్లు, ఇంటిలో సామన్లు, జీవనోపాదులకు జరిగిన నష్టాలకు, రూ.721.42 లక్షలు, అగ్రికల్చర్, ఉద్యాన, పశుసంవర్థక, మత్స్య, చేనేత పరిశ్రమలకు జరిగిన నష్టాలకు రూ.6567.27 లక్షలు, మౌలిక సౌకర్యాలు రహదారులు, ఇరిగేషన్, మంచినీటి పథకాలు, విద్యుత్, పురపాలక శాఖ రూ.3134.40 లక్షలు తక్షణ సహాయం అవసరమని కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో కేంద్ర బృందంలోని అధికారులు మాట్లాడుతూ భారీ వర్షం, వరదలపై ఐఎండీ నుంచి ముందే హెచ్చరికలు జారీ అయినా జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని జిల్లా అధికారులను ప్రశ్నించారు. మంగళగిరిలో చేనేత మగ్గాలు, వస్త్రాలకు ఎందుకు బీమా చేయించలేదని ప్రశ్నించారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు వీలుగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అధికారులకు కేంద్ర బృందం సూచించింది.



గుంటూరు చానల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెక్టర్ తదితరులు

అడ్డగోలుగా.. బస్సు బే

- అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా
- తొలుత వద్దని అడ్డుకుని.. ఆ తర్వాత అంగీకారం
- నెలకు రూ.10 వేల లీజు.. 20 ప్రాంతాల్లో ఓ సంస్థకు అనుమతి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 12: నగరంలో సిటీ బస్సులు లేవు.. కానీ నగరవాసులకు అత్యాధునిక వసతుల పేరుతో ఈ-బస్సు బేల నిర్మాణాలు జరుగుతున్నాయి. గతంలో లక్ష్మీపురంలో బస్సు బే నిర్మాణంపైనే ఎన్నో విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత తిరిగి మరో 20 ప్రాంతాల్లో బస్సు బేల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదించింది. వీటికి అనుమతులు ఇవ్వవద్దని అప్పటి తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా కౌన్సిల్ సమావేశంలో గొడవ చేశారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు.. అప్పటి వైసీపీ పెద్దలు అందరూ కలిసి నగరంలో ఎంతో ఖరీదైన జీఎంసీ స్థలాలను అప్పనంగా ఓ ఏజెన్సీ సంస్థకు ఈ బస్సు బేల నిర్మాణాలకు లీజుకి ఇచ్చారు. ఇదే అవకాశంగా ఆ సంస్థ నిర్వాహకులు ప్రధాన ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ పక్క నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలని చూస్తూ... మరోపక్క రోడ్లను ఆక్రమించుకునేందుకు, నడిరోడ్లపైనే నిర్మాణాలకు జీఎంసీ అనుమతులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, లాడ్జి సెంటర్, పల్నాడు బస్టాండ్, కొరిటపాడు సెంటర్ ఇలా 20 చోట్ల బస్సు బేలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారు. గత పాలకుల తప్పులే నేటి ప్రజలకు శాపాలుగా మారగా మళ్లీ 20 ఈ-బస్ బేలకు అనుమతులపై వివిధ వర్గాలు మండిపడుతున్నాయి. ప్రస్తుతం గాంధీ పార్కు ఎదుట రోడ్డుపై వరకు చేపడుతున్న నిర్మాణాలు చూస్తే వాటికి ఎలా అనుమతి ఇచ్చారో తెలియని పరిస్థితి. ఈ నిర్మాణాన్ని చూస్తే నగరంలో బస్సు బేల అనుమతులు ఎంతలోపభూయిష్టంగా ఉన్నాయో తెలుస్తుంది. వాస్తవానికి పది అడుగులు సరిపోయి బస్ బేలకు పెద్దఎత్తున నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు ఒకలా తీసుకుని మరోలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమాలన్నీ కళ్ల ఎదుట జరుగుతున్న అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఎంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో బస్సు బేల నిర్మాణాల జరిగితే వాహనదారులు వాహన చోదకులు, పాదచారులు ఎంతో ఇబ్బంది పడతారు. అయినా అప్పటి వైసీపీ పెద్దలు నెలకు రూ.10 వేల లీజు చొప్పున అప్పనంగా ఓ సంస్థకు కట్టబెట్టారు. ఈ 20 ప్రాంతాల్లో బస్సు బేల ద్వారా ఆ ఏజెన్సీ నెలకు రూ.లక్షల ఆదాయం కళ్ల చూసే అవకాశం ఉంది. రోడ్లను ఆ సంస్థకు అప్పగించేందుకు అప్పటి పాలకులు భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



గాంధీపార్క్ ఎదుట మెయిన్ రోడ్డు పై చేపట్టిన అడ్డగోలు నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధి వేగవంతం

● ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

మంగళగిరి, సెప్టెంబరు 12: అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడమే లక్ష్యంగా మంగళగిరిలోని క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడతామని ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులైన శివనాథ్ గురు వారం మంగళగిరిలోని అంతర్జాతీయ స్టేడియాన్ని సందర్శించారు. అనంతరం ఏసీఏ కార్యాలయంలో జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. కడప, మంగళగిరి క్రికెట్ స్టేడియాల అభివృద్ధి, కమిటీల నియామకం, అకాడమీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ మాట్లాడుతూ అపెక్స్ కమిటీ సభ్యులతో కలిసి ఏకగ్రీవ తీర్మానాలతో ముందుకు వెళతామన్నారు. మంగళగిరి స్టేడియంలో స్పోర్ట్స్ హబ్ సెంటరును కూడా నెలకొల్పుతామన్నారు. స్టేడియానికి పశ్చిమాన బైపాస్ రోడ్డు నిర్మాణం నాలుగైదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. క్రికెట్ స్టేడియానికి వెళ్లే ప్రధాన రోడ్ల అభివృద్ధి, పార్కింగ్ స్థలాలపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు వెంకట ప్రశాంత్, కార్యదర్శి సానా సతీశ్, సంయుక్త కార్యదర్శి విష్ణుకుమార్ రాజు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ విష్ణుతేజ్ తదితరులు పాల్గొన్నారు.

టాంజానియా వర్సిటీతో ఏఎన్‌యూ ఎంఓయూ

పెదకాకాని, సెప్టెంబరు 12 : టాంజానియా దేశంలోని డొడొమ యూనివర్సిటీతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విదేశీ విద్యార్థుల విభాగం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. గురువారం టాంజానియా యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ లుఘనో జెరెమీ కుసిలుక, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కే.గంగాధరరావులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ.సింహాచలం సమక్షంలో ఈ ఎంఓయూ జరిగింది. విదేశీ విద్యార్థుల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి మాట్లాడుతూ పరస్పరం శిక్షణ, కన్సల్టెన్సీ, ఇన్నోవేషన్, టీచింగ్ అండ్ రీసెర్చ్ పరస్పర మార్పిడి, అకడమిక్ కార్యక్రమాల అభివృద్ధికి కోర్సుల రూపకల్పన, సంయుక్తంగా సైంటిఫిక్ టెక్నాలజీ పరిశోధనా ప్రాజెక్టుల అభివృద్ధితోపాటు రెండు యూనివర్సిటీలకి దోహదపడే పలు అంశాలను ఈ ఎంవోయూ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. టాంజా నియా యూనివర్సిటీ ప్రతినిధి కూసిలుకా మాట్లాడుతూ రెండు విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో ఈ ఎంఓయూ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి.సత్యనారాయణ ఉన్నారు.

ఎకనామిక్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


● రాయలసీమ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

పెదకాకాని, సెప్టెంబరు 12 : ప్రభుత్వ, ఇతర రంగాలలో ఎకనామిక్స్ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ నిర్వహణ ఉండాలని, భారతదేశంలో ఆర్థికవేత్తలకు ప్రభుత్వ రంగం గణనీయమైన సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. కార్పొరేట్ రంగం లో మార్కెట్ పరిశోధన, ఆర్థిక విశ్లేషణ, వ్యాపార అభివృద్ధి వంటి వివిధ పాత్రలలో ఆర్థికవేత్తలను కూడా నియమించుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె. మధుబాబు, వర్సిటీ సోషల్ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతి, సీనియర్ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి విరాళం

● వినుకొండ ఎమ్మెల్యే, ఏపీ క్రెడాయ్ రూ.50 లక్షల చొప్పున చెక్కులు అందజేత

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 12 : రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ తరఫున రూ.50 లక్షల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ క్రెడాయ్ చైర్మన్ శివారెడ్డి, ప్రెసిడెంట్ రమణారావు, కార్యదర్శి బైన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ అంకినీడు రమేష్, విజయవాడ చాప్టర్ అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి శ్రీధర్, సభ్యులు వంశీ, సతీష్ చెరుకూరి తదితరులు కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ అసోసియేషన్ తరఫున మరో రూ.50 లక్షలను వివిధ రూపాలలో వరద బాధితులకు ఖర్చు చేసినట్లు చెప్పారు



ఏపీ క్రెడాయ్ తరఫున రూ. 50 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న ఆళ్ల శివారెడ్డి తదితరులు

సీఎంకు చెక్కును అందజేసిన జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల, ఆయన భార్య గోనుగుంట్ల లీలావతి ముఖ్యమంత్రినికలిసి రూ.50 లక్షల విరాళం చెక్కును అందజేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్, శివశక్తి బయో టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ చెక్కును అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో శివశక్తి కంపెనీ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.



తల్లి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

పుల్లారావు తల్లి అంత్యక్రియలు పూర్తి

చిలకలూరిపేట, సెప్టెంబరు 12 : మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తల్లి నారాయణమ్మ అంత్య క్రియలు గురువారం జరిగాయి. చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి నివాసం నుంచి గణపవరంలోని ఎల్‌సీటీ కంపెనీ వరకు అంతిమయాత్ర సాగింది.ఎల్‌సీటీ కంపెనీ ప్రాంగణంలో దహన సంస్కారాలు నిర్వహించారు. నారాయణమ్మకు కడసారి వీడ్కోలు పలికేందుకు తెలుగు దేశం పార్టీతో సహా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు తరలివచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లాఎస్పీ కంచి శ్రీనివాసరావు తది తరులు ప్రత్తిపాటి పుల్లారావును పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట, గురజాల, పెదకూరపాడు, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు వరుసగా చదలవాడ అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, నజీర్, గల్లా మాధవి, ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి గొట్టిపాటి లక్ష్మి, గొట్టిపాటి భరత్, మల్లెల రాజేష్ నాయుడు, జనసేన నాయకులు తోట రాజా రమేష్, విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఉన్నారు.

మానసిక బాధను తెలుసుకుంటే ఆత్మహత్యల నివారణ సాధ్యమే

● ప్రొఫెసర్ ఉమాజ్యోతి

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 12: ఆత్మహత్య ప్రయత్నాలు చేసే వారిని వేధించే మానసిక బాధను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చేయూత అందిస్తే చాల వరకు ఆత్మహత్య ఘటనలను నివారించవచ్చని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్. ఉమాజ్యోతి తెలిపారు. గురువారం వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే పురస్కరించుకొని ప్రభుత్వాస్పత్రి సైకియాట్రి వార్డులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆత్మహత్య యత్నాలు చేసే వారిలో సాధారణంగా మానసిక వ్యాకులత అనే జబ్బు ఉంటుందని, వీరు విచారంగా ఉండటం, ఒంటరిగా గడపటం, తరచూ తమ జీవితం వ్యర్థమని, చావే పరిష్కారమని చెబుతుంటారని ఆమె వివరించారు. వ్యక్తుల్లో ఇలాంటి లక్షణాలు గమనిస్తే కనుక వారి కుటుంబ సభ్యులు అశ్రద్ధ చేయకుండా తగిన చికిత్సలు చేయించాలని తెలిపారు. దీని వల్ల చాల వరకు ఆత్మహత్యల నివారణ సాధ్యపడుతుందని, బాధితులకు వైద్యనిపుణులు తరచూ కౌన్సెలింగ్ చేయడంతో పాటు తగిన మందులు వాడటం ద్వారా వారి ఆలోచనలను సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల వైద్యవిభాగం నిపుణులు వీ వెంకట కిరణ్, డాక్టర్ రత్నకిషయ్, పీ సాయికిరణ్, ఎస్ నిమీషా, వీ సాయికృష్ణ, ఎస్ ప్రసాద్, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ ఏవిజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైకియాట్రి వార్డులో రోగుల కోసం రూ.25 వేలు విలువైన కుర్చీలను సెవెన్ గ్రీన్ చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు సిద్దార్థ అందజేశారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్. ఉమాజ్యోతి

నిమజ్జనం ఊరేగింపులో ఘర్షణ

● జనసేన,టీడీపీ వర్గీయులను అడ్డుకున్న వైసీపీ

● రాళ్ళు,సీసాలు రువ్వుకున్న ఇరువర్గాలు

బొమ్మరాజుపల్లి(ఈపూరు)సెప్టెంబరు12: మండలంలోని బొమ్మరాజుపల్లిలో వినాయకుని విగ్రహం నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొని ఘర్షణకు దారితీసింది. టీడీపీ,జనసేన నాయకులు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం నిమజ్జనం నిమిత్తం గ్రామంలో భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే, ఆ సమయంలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అనంతరం నిమజ్జనం నిమిత్తం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తుండగా.. ఆ ఊరేగింపు ప్రధాన సెంటర్‌కు చేరుకునే సమయంలో జనసేన,టీడీపీ వర్గీయులను అడ్డుకున్న వైసీపీ వర్గీయులు, ఆ శిలాఫలకాలను ధ్వంసం చేశారంటూ వారితో వాదనకు దిగడమే కాకుండా వారిపై రాళ్ళు,సీసాలు రువ్వి, కర్రలతో దాడి చేశారు. ఇరు వర్గాలవారు కర్రలు, రాళ్ళు,సీసాలను ఒకరిపైఒకరు రువ్వుకున్నారు. వైసీపీ దాడిలో పదిమంది గాయాల పాల య్యారు. జనసేన సిమెంట్ బల్లను ధ్వంసం చేశారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన కారులను పోలీసులు అక్కడ నుండి తరిమి వేశారు. బాధి తుల ఫిర్యాదు మేరకు దాడులకు పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు.





వైసీపీ వాళ్ళు ధ్వంసం చేసిన జనసేన సిమెంట్ బల్ల, గుర్తుతెలియనివ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకం

యువకుల ర్యాష్ డ్రైవింగ్

● ప్రశ్నించిన ఇద్దరిపై కత్తులతో దాడి

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : ముగ్గురు యువకులపై కత్తులతో ఏడుగురు యువకులు దాడి చేసి గాయ పరిచిన సంఘటన స్థానిక వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. దేవాలయం వద్ద వినాయక మండపం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మునిసిపల్ ఏరియాకు చెందిన యువకులు అచ్యుత్, జీవన్ తమ బైక్ పై వేగంగా ఆ ప్రాంతానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కఠారి వెంకటేష్, రాజమంచి పవన్ కల్యాణ్‌లు అతివేగంగా బైక్ నడపడమేంటని ప్రశ్నించారు. దీంతో, ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. ఈక్రమంలో అక్కడి నుంచి బైక్ పై వెళ్ళిపోయిన జీవన్, అచ్యుత్‌లు తిరిగి రాత్రి 12 గంటల సమయంలో మరో ఐదుగురిని వెంట తీసుకొని ఆ వినాయక మండపం వద్దకు వచ్చి.. అక్కడే ఉన్న వెంకటేష్, పవన్ కళ్యాణ్‌లను తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లు, కత్తులతో పొడిచి గాయపరిచారు. వారిని అడ్డుకున్న యువకుడు పూర్ణని కూడా కత్తితో గాయపరిచారు. అక్కడి జనం రావడంతో దాడి చేసిన ఏడుగురు యువ కులు తమ వాహనాలపై పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన వెంకటేష్, పవన్ కల్యాణ్‌లను వారి కుటుంబసభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు పాల్పడ్డ యువకుల గృహాల వైపు బాధితుల బంధువులు, కుటుంబసభ్యులు వెళ్లి వారి గృహాలపై రాళ్ళతో దాడి చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య రూరల్ సీఐ శ్రీని వాసరావు, పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ఆ ప్రాంతానికి వెళ్లి ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించివేశారు. పోలీస్ జీపు పై కూడా క్షతగాత్రుల బంధువుల్లో కొందరు రాళ్ళు రువ్వారు. దాడికి పాల్పడ్డ యువకుల స్కూటీని బాధి తుల బంధువులు దగ్ధం చేశారు. దాడికి పాల్పడ్డ జీవన్, అచ్యుత్‌లతో పాటు మరో ఐదుగురు యువకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని విచారించినట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. దాడికి ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నా మని, క్షతగాత్రుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు చెప్పారు.



కత్తుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ కఠారి వెంకటేష్, రాచమంచి పవన్ కల్యాణ్



నిషేధిత భూమిలో బినామీ అక్రమ నిర్మాణం!

● రాజధాని అమరావతి ప్రాంతంలో దర్జాగా కబ్జా

● నవులూరు రాజీవ్ నగర్‌లో అక్రమ నిర్మాణం

● మిగిలిన భూమి ఓ మాజీ ప్రజాప్రతినిధి పీఏ ఆధీనంలో

మంగళగిరి, సెప్టెంబరు 12: రాజధాని అమరావతి ప్రాంతంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తూ పెద్ద భవంతులు నిర్మిస్తున్నారు. మంగళగిరి మండలం నవులూరు రాజీవ్ నగర్‌లోని సీఆర్‌డీఏ నిషేధిత జాబితాలో వున్న భూమిని ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా కళ్యాణ మండపాన్నే నిర్మించారు. దీనికి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు ఇంటి పన్ను ఎలా ఇచ్చారనే విషయం చర్చనీయాంశంగా మారింది. రాజధాని ప్రాంతానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన బినామీ ఈ కట్టడాన్ని నిర్మించినట్టుగా తెలుస్తోంది. కళ్యాణ మండపం నిర్మించగా మిగులు భూమి సదరు ప్రజాప్రతినిధి పీఏ ఆధీనంలో వున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం చివరి కాలంలో ఈ అక్రమ నిర్మాణం జరుగగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటి పన్ను మంజూరైనట్టు సమాచారం. అధికారులు, పాలకులు స్పందించి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




నిషేధిత భూమిలో నిర్మించిన ఫంక్షన్ హాలు

అమరావతిలో విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధం

● కేంద్ర విమానయాన శాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝూ

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 12 :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే రాజధాని అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝూ తెలిపారు. ఈ విషయాన్ని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులకు కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఓ లేఖ ద్వారా తెలిపారు. కూటమి ప్రభుత్వం అమరావతిలో నూతన రాజధాని నిర్మాణం కోసం అడుగులు వేస్తున్న దరిమిలా ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశం ఉందని డాక్టర్ వీరాంజనేయులు గడచిన ఆగస్టు 2న ప్రధాన మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ఢిల్లీలో వ్యక్తిగతంగా కలిసి ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అమిత్ కుమార్ జా స్పందిస్తూ తమ అభిప్రాయాన్ని లేఖ ద్వారా తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించిన విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్తానని జాస్తి వీరాంజనేయులు తెలిపారు.



8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 8 క్రస్ట్ గేట్ల ద్వారా గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2926 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,273 క్యూసెక్కులు, 8 క్రస్ట్ గేట్ల ద్వారా 64,720 క్యూసెక్కులు,ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,08,706 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,08,706 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 12 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,14,970 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందని తెలిపారు. ప్రాజెక్టు వద్ద మూడు గేట్ల ద్వారా 87,909 క్యూసెక్కుల నీరు, పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

0.7326 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,సెప్టెంబరు 12 : సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.7326 విద్యుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు.ప్రాజెక్టుకు చెందిన 5 రేడియల్ క్రస్ట్ గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 78425,టేల్ రేస్ ఛానల్ ద్వారా 8215 మొత్తంగా 86,640 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు.రిజర్వాయర్‌లో 75.37 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.991 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 49 వేల 450 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 3918 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 12: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 53వేల 368 క్యూసెక్కుల వరద నీరు గురువారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర, 10 గేట్లను 2 అడుగులు ఎత్తి దిగువకు 49 వేల 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3918 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

జడ్పీ సీఈవో మాతృ శాఖకు బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్తు సీఈవో వసంత రాయుడుని మాతృశాఖకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖకు చెందిన వసంతరాయుడు ఎన్నికలకు ముందు బదిలీపై జడ్పీ సీఈవోగా నియమితులయ్యారు. ఆయనతో పాటు రెవెన్యూ నుంచి వచ్చి వేరే జిల్లాల్లో పంచాయతీరాజ్‌లో కొనసాగుతోన్న మరో ముగ్గురిని కూడా మాతృశాఖకు పంపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

22 వరకు ఉద్యోగస్తుల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధాన్ని ఈ నెల 22వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. 23 నుంచి బ్యాన్ అమలులోకి వస్తుందని తాజాగా ప్రభుత్వ సాధా రణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా ఉద్యో గుల బదిలీల ప్రక్రియకు ఆటంకం వాటిల్లింది. కొంతమంది అధికారులు విజయవాడలో వరద సహాయక, ఎన్యూమరేషన్ విధులకు వెళ్లాల్సి వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసు కొని 22 వరకు బదిలీలు చేసు కోవచ్చని పేర్కొంది.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

మంగళగిరి, సెప్టెంబరు 12: రాష్ట్రంలోని చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ఒక్కొక్కరికి రూ.2,100 చొప్పున రాష్ట్రంలోని లక్షా 22 వేల 864 చేనేత కుటుంబాలకు రూ.25.76 కోట్ల మేర ఆరోగ్య బీమా చెల్లిం చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఐసీఐసీ లాంబార్డ్ 2006లో ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా పథ కంలో ప్రీమియం మొత్తం రూ.1450లో కార్మికుడు రూ.200 చెల్లించాల్సి వచ్చేదని, మిగతా రూ. 1250 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించి బీమాను అమలు చేసేవని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులు చెల్లించాల్సిన బీమా మొత్తాన్ని చెల్లిం చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. గత ఎన్ని కలకు ముందు చంద్రబాబు, లోకేశ్‌లు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటీ అమలు చేస్తూ చేనేతల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

50,049 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 47,159 మిర్చి టిక్కీలు విక్రయానికి వచ్చాయి. వీటితో పాటు నిల్వ ఉన్న వాటిని కూడా కలుపుకుని 50,049 టిక్కీల అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,085 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	16500	334	8000	16200
నెంబరు. 5	9200	15000	నెంబరు.5	11500	14000
273	10000	14200	273	11200	13500
341	8000	16000	341	10500	15500
4884	--	--	4884	9200	14500
సూపర్ 10	13500	16500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	8500	18800
బ్యాడిగి	8500	15000	బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	11000	13000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	4500	10500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



గణపతి మండపంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని వినాయక మండపాల్లో గురువారం నిర్వహించిన 6వ రోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు నీటమునిగి అల్లాడిపోయిన విజయవాడ ప్రజల కష్టాలు తొలగిపోయి, వారి జీవితాల్లో మళ్లీ సంతోషాలు రావాలని ఆ గణనాథుడిని ప్రార్థించానన్నారు. ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను వినియోగించుకొని సుఖ, సంతోషాలతో ఉండాలని అన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ కష్టపడే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ విఘ్నేశ్వరుడు ఆయురారోగ్యాలు అందించాలని స్వామివారిని ప్రార్థించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చిస్టీ, గోళ్ళ ప్రభాకర్, బట్టా రాజా, సలీం, చౌదరి శీను పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో టీడీపీ నాయకుల ప్రత్యేక పూజలు



గణపతి ప్రత్యేక పూజల్లో భరత్‌రెడ్డి, గౌస్, నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 12: వినాయక చవితి సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 42 వినాయక మండపాలను వారి ఆహ్వానం మేరకు టీడీపీ నాయకులు భీమనాదం భరత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్, యిర్రి సిద్ధార్థ్ (బాజి) హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏటుకూరు రోడ్డులోనున్న వాసవి యూత్, వాసవి హోల్ సేల్ క్లాత్ మార్చంట్ యూత్, డిఎస్ నగర్ వరసిద్ధి వినాయక యూత్, ఏటుకూరు హనుమాన్ యూత్, పాత గుంటూరు గణేష్ యూత్, నంబూరు మావూరి మహేంద్రరెడ్డి యూత్, బాల గణేష్ యూత్, కాజా గ్రామం విఘ్నేశ్వర యూత్, మంగళదాస్ నగర్ సిద్ధి వినాయక యూత్, వాసవి నగర్ ఛత్రపతి శివాజీ యూత్, గణేష్ నగర్ గణేష్ యూత్, సంగడిగుంట రాయల్ గణేష్ యూత్, సంగడి గుంట లక్ష్మి గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్, సంగడిగుంట బాలగణేష్ యూత్, సంగడిగుంట గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వ రరావు, వాసవి క్లాత్ మార్కెట్ ప్రెసిడెంట్ సాంబశివరావు తదితరులున్నారు.

ఇంటర్నేషనల్ టాలెంట్ షో పోటీల్లో ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), సెప్టెంబరు 12 : ట్యునీషియా దేశంలోని, ట్యునీష్ సైన్స్ సిటీలో ఈ నెల 7, 8 తేదీలలో రెండు రోజుల పాటు ఐఈఈఈ ఆధ్వర్యంలో "ఏసిస్ట్12" యూత్ ఎండీవోర్స్ ఫర్ సోషల్ ఇన్నోవేషన్ యూసింగ్ సస్టైన బుల్ టెక్నాలజీ) పేరుతో నిర్వహించిన ఇంటర్నేషనల్ టాలెంట్ షోలో కళాశాలలోని ఐటీ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న జి.భరణి విష్ణు, బత్తుల త్రినాధ్, బోయపాటి శ్రీనివాసులు, ఎర్రెద్దుల వినూత్న విద్యార్థుల జట్టు రూపొందించిన "కృత్రిమ అవయవ ఆవిష్కరణ" ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. అదేవిధంగా మూడవ సంవత్సరం చదువుతున్న కే.హర్ష తేజ, కే.గోపి, వాసవి, ఎస్. హరీష్ చౌదరి, కే.రాజా అభిజీత్ విద్యార్థుల బృందం రూపొందించిన "చిల్లీ డిపిడికిల్" అనే నూతన యంత్ర ఆవిష్కరణ అంతర్జాతీయ స్థాయిలో గ్రాండ్ ఫినాలేలో చేరి ప్రశంసా పురస్కారాలు అందుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

అన్న క్యాంటీన్‌కు మాదల చైతన్య రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే నసీర్‌కు చెక్కు అందజేస్తున్న చైతన్య

గుంటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలు, దినసరి కూలీలకు 5 రూపాయలకే అల్పాహారం, భోజనం అందించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని జన చైతన్య ప్రాపర్టీస్ ఛైర్మన్ మాదల చైతన్య, ఆయన తండ్రి మాదల రత్నగిరి అన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష చెక్కును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు గురువారం మాదల చైతన్య అందించారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం ప్రజలు కూడా స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వాలని ఆయన సూచించారు. విజయవాడ వరద బాధితులకు గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు సమక్షంలో 5000 మందికి భోజనం అందించామని చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు అతి తక్కువ ఖర్చుకే మూడు పూటలా అన్నం పెట్టాలన్న సంకల్పంతో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామన్నారు. అలాంటి గొప్ప కార్యక్రమానికి తన వంతుగా మాదల చైతన్య లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషకరమన్నారు.

ఏలూరి బ్యాంకు సేవలు మరింత విస్తృతం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఖాతాదారులు, అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 12: ఖాతాదారులకు అనుకూలంగా ఏలూరి బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేస్తామని బ్యాంకు ముఖ్యశాఖాధికారి ఎన్ సీతారావమాంజనేయులు తెలిపారు. ఏలూరి బ్యాంకు బ్రాడీపేట శాఖ ఖాతాదారుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు వ్యాపారం రూ.64 కోట్ల నుంచి రూ. 76 కోట్లకు పెరిగిందన్నారు. మరో ముఖ్య అధికారి పీవీ శర్మ మాట్లాడుతూ బ్యాంకులో డిజిటల్ సర్వీసులన్నీ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు వీ ప్రసాద్, పలువురు ఖాతాదారులు హాజరయ్యారు.

బ్యాంకు రుణాల్లో నిబంధనలు పక్కాగా పాటించాలి

● లేకుంటే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది
● త్వరలో కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌తో మరింత పారదర్శకత
● డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జ్, జేసీ భార్గవతేజ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవతేజ, సీఈవో కృష్ణవేణి, హాజరైన బ్యాంకు అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 12: బ్యాంకు రుణాల మంజూరులో అధికారులు, ఉద్యోగులు నిబంధనలు పక్కాగా పాటించాలని, లేకుంటే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ సూచించారు. బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ గురువారం జరిగింది. బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా హాజరైన జేసీ మాట్లాడుతూ నిబంధనలు పాటించని పక్షంలో అధికారులు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బ్యాంకు రుణాల మంజూరులో అధికారులకు అనేక ఒత్తిళ్ళు వస్తాయని, అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ నేతల నుంచి పై స్థాయిలో కూడా సిఫార్సులు వస్తాయని, అయినా నిబంధనల మేరకు మాత్రమే వ్యవహరించాలని సూచించారు. గుంటూరు డీసీసీబీలో అధికారులకు అంత మంచి పేరు లేదని, నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. వచ్చే అక్టోబరు, నవంబరు మాసాల్లోపు కొత్తగా కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ అమల్లోకి వస్తుందని, తద్వారా వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందన్నారు. అంతకు ముందు బ్యాంకు సీఈవో కృష్ణవేణి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం డీసీసీబీ 21.94 కోట్ల నికర లాభంగా ఉందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం 114వ వార్షిక నివేదికను చదివి వినిపించారు. వార్షిక నివేదిక వివరాలతో పాటు సభ్యత్వం, వాటా ధనం, డిపాజిట్లు, పొందిన రుణాలు, వ్యాపార ధనం, అప్పులు, క్యాష్ క్రెడిట్, స్వల్ప, దీర్ఘకాలిక అప్పులు, పెట్టుబడులు, వడ్డీ రాయితీ పథకం, వ్యాపార ఫలితాలు వంటి వివరాలను జేసీ ఎదుట వివరించారు.

త్వరలో పెదనందిపాడు, ముట్లూరు బ్రాంచిలు ప్రారంభం

డీసీసీబీకి ప్రస్తుతమున్న బ్రాంచీలతో పాటు పెదకాకాని, పెదనందిపాడు, ముట్లూరులో నూతన బ్రాంచిలు ఏర్పాటు చేస్తూ ప్రతిపాదనలు రిజర్వ్ బ్యాంకుకు పంపినట్లు సీఈవో తెలిపారు. ఈ మేరకు పెదనందిపాడు, ముట్లూరులో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు రిజర్వ్‌బ్యాంకు నుంచి అనుమతితో పాటు లైసెన్స్ మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే సదరు రెండు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నూతన వార్షిక నివేదికను హాజరైన సభ్యులంతా చప్పట్లతో ఆమోదం తెలిపారు.

14 నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12 : న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంకిరెడ్డిపాలెంలో ఈనెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీ.రేవతి, జీ.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కళాశాల జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 6305916566 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎస్‌కేబీపీఎం స్కూల్ విద్యార్థులకు కెనరా బ్యాంక్ స్కాలర్‌షిప్ పంపిణీ

గుంటూరు (విద్య), సెప్టెంబరు 12 : స్థానిక ఎన్జీవో కాలనీలోని శ్రీ కోన బాల ప్రభాకర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో (ఎస్‌కేబీపీఎం) విద్యార్థులకు కెనరా విద్యా జ్యోతి పేరుతో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థిని కే ప్రియాంక, 9వ తరగతి విద్యార్థిని జే కరుణకుమారి, 8వ తరగతి విద్యార్థిని వి.ఆశ, ఏడో తరగతి విద్యార్థిని జి.అమూల్య, ఆరో తరగతి విద్యార్థిని ఎస్.నందు తదితరులకు 5000 చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కె.పద్మజ, ఎస్.విజయకుమార్ సిహెచ్ జ్ఞాన సుందరి, డి చంద్రశేఖర్, జేమ్స్ పర్వీన్, అంకుల్, శేషి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, అభ్యుదయ లౌకిక శక్తులకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. బ్రాడీపేట, సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం సీతారామ్ ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యునిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ మతోన్మాద శక్తులను దాని ప్రమాదాన్ని ఎండగట్టడంలో ఎనలేని కృషి చేశారన్నారు. నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, పాశం రామారావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పార్థసారధి, వామపక్ష పార్టీ నాయకులు కే నళినికాంత్. ఎల్ ఎస్ భారవి, వై రాధాకృష్ణ. ఎన్ భావన్నారాయణ, ఎంఎ చిష్టి, అజయ్‌కుమార్, బి శ్రీనివాసరావు, కళ్యాణి, బి లక్ష్మణరావు, ఎండీ అక్బర్ తదితరులు ఉన్నారు.



సీతారాం యేచూరికి నివాళులర్పిస్తున్న మాణిక్యవరప్రసాదు, వామపక్ష పార్టీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి సంతాపం

గుంటూరు, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఇండియా కూటమి నేత సీతారామ్ ఏచూరి మృతికి మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై గళమెత్తిన వామపక్ష పోరాట యోధుడిని కోల్పోయామని అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేయటంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

● ఇండియా కూటమి నేత, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరనిలోటన్నారు.

● సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వామపక్ష యోధుడు ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు.

● గుంటూరు, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం భారతదేశం అభివృద్ధికి, రాజకీయాలకు తీరనిలోటని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి పేదల పక్షాన దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జాతీయ విపత్తుగా గుర్తించాలి : రైతు సంఘం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12 : భారీ వర్షాలతో కోలుకోలేని దెబ్బతిన్న పరిణామాల్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ జాయింట్ కార్యదర్శి బృందానికి గురువారం రైతు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో డెల్టా ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందానికి విన్నవించారు. రాష్ట్రంలో 60 వేల మంది సాగు రైతులకు చెందిన 1.50 లక్షల ఎకరాల పంటలు చేతికొచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పాడి రైతులు పూర్తిగా దివాలా పరిస్థితిలోకి పోయారని అన్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర నుంచి వచ్చే మొక్కుబడి సాయం కాకుండా మరింత సాయం పెంచి ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి రూ.10 వేల కోట్లు అందజేస్తే వరదల కారణంగా నష్టపోయిన వారికి న్యాయం జరుగుతుందని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర రైతు సంఘం సభ్యులు



చిన్న నారాయణమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నసీర్

ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తికి నసీర్ నివాళి

గుంటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి చిన్న నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో చిలకలూరి పేటలోని ఆయన స్వగృహానికి వెళ్లి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆమెకు నివా ళులర్పించారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివా ళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును పరామర్శించారు.

● చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి నారాయణమ్మ మరణ వార్త తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో వుంచిన ఆమె పార్థివదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు యరపతినేని, మాధవి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 12: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పాతిమాపురం, పట్టాభిపురం మెయిన్ రోడ్డు, చంద్రమౌళీశ్వరనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

విశ్వకర్మ జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించండి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12: ఈ నెల 17న జరిగే విశ్వకర్మ జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేగాక రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది విశ్వకర్మ మాల ధారణ ధరించి 42 రోజులు దీక్ష పూని కొండపల్లిలో విశ్వకర్మ భగవాన్ దేవాలయంలో జరిగే దీక్ష విరమణ కార్యక్రమం, యజ్ఞ మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలని కోరారు.

సంక్షిప్త రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12: నారద మహాముని వాల్మీకి మహర్షికి ఉపదేశించిన సంక్షిప్త రామాయణంపై గురువారం సుందర సత్సంగ్ సభ్యులు కెవి కోటేశ్వరరావు ధారావాహిక ప్రవచనం చేశారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఈ కార్యక్రమం జరిగింది. కోటేశ్వరరావు ప్రవచిస్తూ రాముడు 11 వేల సంవత్సరాలు పరిపాలన చేసి అద్వితీయమైన ఘనతను గడించారన్నారు. ప్రతి భారతీయుని హృదయంలో శాశ్వతమైన స్థానాన్ని సీతారాముల వారు పొందారన్నారు.

సువాసినులకు గాజుల వితరణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 12: కోటి కుంకుమార్చనలో భాగంగా స్థానిక అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి మందిరంలో గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సువాసినులకు అమ్మవారి గాజులు, పసుపు, కుంకుమ, గంధం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మర్రిపాటి ప్రసాదు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



ఓరుగంటి సరోజిని పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే మాధవి, మాజీ మేయర్ నాగరాజు తదితరులు

డాక్టర్ ఓవీ రమణకు మాతృవియోగం

● నివాళులర్పించిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 12 : నగరంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి ఓరుగంటి సరోజిని (96) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. 15 రోజులుగా ఆమె నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో చిన్నవాడైన డాక్టర్ రమణ హోమియో రంగంలో ఎంతో పేరు ప్రసిద్ధిగాంచారు. రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మాజీ మేయర్ కన్నా నాగరాజు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి, ఆర్టీవో గడ్డిపాటి అనిల్ కుమార్, గుంటూరు ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, తిరుపతి జేటీసీ బసిరెడ్డి, పారిశ్రామికవేత్త సోమేపల్లి శివప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ చిరుమామిళ్ల రాంబాబు, నగర ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వరద బాధితులకు డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల వితరణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 12 : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం స్థానిక డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమవంతు వితరణ ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు రూ.1.84 లక్షలు సీఎం సహాయనిధికి అందజేశారు. వెలగపూడిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఈ మొత్తాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అభినందించారు.

కస్టమ్స్, జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో ....



బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి, ఏసీ, జేసీలు

గుంటూరు, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రంలోని పలు కస్టమ్స్, జీఎస్టీ శాఖా కార్యాలయాలలో 'బాక్స్ ఆఫ్ కైండ్ నెస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కస్టమ్స్, జీఎస్టీ శాఖలలోని అన్ని విభాగాలకు చెం దిన అధికారుల నుంచి వరద బాధితులకు అవసరమయ్యే మందులు, దుప్పట్లు, సబ్బులు, హ్యాండ్ వాష్‌లు, మస్కిటో కాయిల్స్, స్ప్రేలు, సర్ఫ్‌లు, క్లీనింగ్ లిక్విడ్ లు, శానిటరీ సామగ్రి తదితర వస్తువులు బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ ద్వారా సేకరించ నున్నారు. సేకరించిన వస్తు సామగ్రిని కిట్‌ల రూపంలో వరద బాధితులకు పంపిణీ చేయనున్నారు. గుంటూరు కన్నావారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారం భించారు. వరద ప్రాంతాలలో రెండు రోజులపాటు కస్టమ్స్, జీఎస్టీ శాఖ నిర్వ హించిన రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్‌లో చురుకుగా పాల్గొన్న ఉద్యోగులకు, విద్యా వాలంటీర్లకు కమిషనర్ ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎన్.మధుసూదనరెడ్డి, జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్ణ తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలసి చెక్కులు అందజేశారు.

ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ ' మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'ముసిముసి నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడుగారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్‌బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తిక్ హృద్యంగా ఆలపించారు.

అప్‌డేట్స్

దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

వరద బాధితుల కోసం రూ.5 లక్షల విరాళం



మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న చిల్లపల్లి మోహనరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం మంగళగిరికి చెందిన వైసీపీ నేత, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ చెక్కును మంత్రి నారా లోకేశ్‌కు గురువారం ఏపీ సచివాయలంలో అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అందజేస్తున్న దాతలకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత షేక్ అక్రమ్ పాల్గొన్నారు.

బాధితులకు బ్రిలియంట్ స్కూల్ వితరణ



సీఎం చంద్రబాబునాయుడుకి లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న బ్రిలియంట్ స్కూల్ డైరెక్టర్ ఖాజావలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సాయం కోసం చౌడవరం బ్రిలియంట్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ ఖాజావలి లక్ష రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అందజేశారు. పాఠశాల తరపున తమ వంతు సాయం అందజేసినట్లు ఖాజావలి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కే రవికుమార్, కే రాజారావు, కిరణ్‌కుమార్, పోరళ్ల సాంబశివరావులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

దక్షిణాసియా అథ్లెటిక్స్ పోటీలకు ఎస్ఆర్ఎం విద్యార్థి



వి.హిమతేజ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 12: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీఏ చదువుతున్న వి.హిమతేజ దక్షిణాసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2024 పోటీలకు ఎంపికయ్యాడు. చెన్నయ్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 12 నుంచి పోటీలు జరుగుతున్నాయి. భారత్ తరపున ఎంపికైన రన్నర్స్‌లో హిమతేజ ఒకరు కావడం విశేషం. 4/400 మీటర్ల పరుగు పందెంలో హిమతేజ ప్రతిభను కనబర్చి సౌత్ ఏషియన్ పోటీలకు ఎంపికయ్యాడు. సుమారు పదికి పైగా దేశాల క్రీడాకారులు పాల్గొంటున్న పోటీలకు హిమతేజ ఎంపికవడం హర్షణీయమని యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ ధీరజ్ చెప్పారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

మంగళగిరి, సెప్టెంబరు 12: రాష్ట్రంలోని చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ఒక్కొక్కరికి రూ.2,100 చొప్పున రాష్ట్రంలోని లక్షా 22 వేల 864 చేనేత కుటుంబాలకు రూ.25.76 కోట్ల మేర ఆరోగ్య బీమా చెల్లించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. గత ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ చేనేతల సంక్షేమం కోసం పాటు పడుతున్నారని ఆయన తెలిపారు.

పొలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు



ఉండవల్లిలో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

తాడేపల్లి, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, వచ్చిన వరదలకు పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించే క్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారులు గురువారం ఉండవల్లిలో పొలాలు పరిశీలించారు. నష్టపోయిన పొలాలను అంచనా వేసేందుకు వచ్చిన ఈ బృందంతో రాజధాని రైతు సంఘం నాయకులు స్థానిక రైతు కొర్రపోలు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పంట నష్టపరిహారం పూర్తిగా ఇవ్వాలని, ఎక్కువగా కమర్షియల్ క్రాప్స్ ఉన్నాయని, అరటి, కంద, పసుపు, గులాబి, లిల్లీ తదితర పంటలు వేశారని పంటలన్నీ వరద దెబ్బకు నష్టపోయాయని విన్నవించారు. స్థానిక రైతులు రఘునాథరెడ్డి, మని, సిలార్ తదితరులు తమ బాధలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, హార్టికల్చర్ డీడీ రవీంద్ర, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యాన గురువారం మంగళగిరిలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ వరదల బీభత్సానికి విజయవాడ నగరంలో లెక్కలేనన్ని కుటుంబాలు ఆశ్రయాన్ని కోల్పోయాయని, ఇంకా అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలోనే చిక్కుకుని ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ విరాళాల సేకరణ ద్వారా రూ.23 వేల 535 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్లకాశయ్య, అన్నవరపు ప్రభాకర్‌రావు, నందం బ్రహ్మేశ్వరరావు, గండికోట దుర్గారావు, తుడిమెళ్ల వెంకటయ్య, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పెదనందిపాడు, ముట్లూరు బ్రాంచిలు ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 12: బ్యాంకు రుణాల మంజూరులో అధికారులు, ఉద్యోగులు నిబంధనలు పక్కాగా పాటించాలని, లేకుంటే అధికా రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ సూచించారు. డీసీసీబీకి ప్రస్తుతమున్న బ్రాంచీలతో పాటు పెదకాకాని, పెదనందిపాడు, ముట్లూరులో నూతన బ్రాంచిలు ఏర్పాటు చేస్తూ ప్రతిపాదనలు రిజర్వ్ బ్యాంకుకు పంపినట్లు సీఈవో తెలిపారు. ఈ మేరకు పెదనందిపాడు, ముట్లూరులో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు రిజర్వ్‌బ్యాంకు నుంచి అనుమతితో పాటు లైసెన్స్ మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే సదరు రెండు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

లాం ఉపసర్పంచ్ రాజీనామా

తాడికొండ, సెప్టెంబరు 12: మండలపరిధిలోని లాం గ్రామ ఉప సర్పంచ్ తేలుకుట్ల శేషయ్య తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తాడికొండ ఎంపీడీవో అత్తోట దీప్తికి తన రాజీనామ పత్రాన్ని అందజేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

వరద బాధితులకు కొనసాగుతున్న సాయం



ఉద్దండ్రాయునిపాలెంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందిస్తున్న మల్లికార్జునరెడ్డి, పులి చిన్నా, కోటేశ్వరావు

తుళ్లూరు, సెప్టెంబరు 12: మండలంలో వరద బాధితులకు దాతల సాయం కొనసాగుతుంది. ఒక పక్క కూటమి ప్రభుత్వం వారిని ఆదుకుంటుంటే, దాతలు సాయం చేయటానికి ముందుకు వస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గానికి చెందిన చింతలపాటి మల్లికార్జునరెడ్డి నిత్యావసర సరుకులను గురువారం ఉద్దండ్రాయునిపాలెం వరద బాధితులకు పంపిణీ చేశారు. దళిత టీడీపీ నేత పులిచిన్నా ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోటేశ్వరావు చేతుల మీదగా సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

చేనేత మగ్గాలను పరిశీలించిన కేంద్ర బృందం

● సమస్యలు విన్నవించిన నేతలు, కార్మికులు



భారీ వర్షాలకు పాడైపోయిన చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 12: భారీ వర్షాల కారణంగా చేనేత రంగానికి జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం గురువారం మంగళగిరిలో పర్యటించింది. బృందం సభ్యులైన వ్యవసాయ, రైతు శాఖల డైరెక్టర్ డాక్టర్ ఏఎల్ వగ్మేర్, ఆర్థిక మంత్రిత్వ ఎక్స్‌పెండిచర్ శాఖ కన్సల్టెంట్ ఆర్‌బీ కౌల్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ప్రదీప్‌కుమార్‌లు పాతమంగళగిరి దింపుడు కళ్లెం వద్ద చేనేత వర్షాలకు దెబ్బతిన్న చేనేత మగ్గాలను పరిశీలించారు. పాడైపోయిన చేనేత ఉత్పత్తులు, పరికరాలను చేనేత కార్మికులు బృందం దృష్టికి తీసుకువెళ్లారు. చేనేత పరిశ్రమకు జరిగిన నష్టాన్ని కలెక్టరు నాగలక్ష్మీ కేంద్ర బృందానికి వివరించారు. మగ్గం గుంతల్లోకి నీరు చేరడం వల్ల నూలు, మగ్గంపై చీరలు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి రూ.59.37 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. పలువురు చేనేత కార్మికులు, నాయకులు మాట్లా డుతూ మగ్గంపై నేతతోపాటు వస్త్ర నిల్వలు పూర్తిగా పాడైపోయాయని, నష్టపోయిన ఉత్పత్తులకు, మగ్గాలకు పరిహారం అందించాలని కోరారు. చేనేత కార్మిక సంఘాల నాయకులు కేంద్ర బృందానికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, చేనేత జౌళి శాఖ ఏడీ వనజ, ఆర్డీవోలు పెద్ది రోజా, శ్రీకర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మహానాడు ఏరియాలో వరద తాకిడికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న కేంద్రబృందం

మహానాడులో బాధిత ప్రాంతాల్లో పర్యటన

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 12: తాడేపల్లి పట్టణంలోని మహానాడు కాలనీలో గురువారం ముంపు బాధితులతో కేంద్ర బృందం సభ్యులు మాట్లాడారు. వరద ముంపు వల్ల జరిగిన నష్టాన్ని ఇంట్లోని సామగ్రిని పరిశీలించారు. వరదల వల్ల ప్రతి ఇంటికి జరిగిన నష్టాన్ని జిల్లా యం త్రాంగం తమ దృష్టికి తీసుకువచ్చారని, వాస్తవికతను పరిశీలించి ఆర్థిక సహకారం అందించేందుకు పర్యటిస్తున్నట్లు కేంద్ర బృందం సభ్యులు వారి కి తెలిపారు. అన్ని విధాలా మహానాడు కాలనీ వాసులను ఆదుకుంటామని అధైర్యపడవద్దని కేంద్ర బృందం సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్‌డివో శ్రీకర్, జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషా, జిల్లా వ్యవసాయశాఖాధి కారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ ఉపసంచాలకులు రవీందర్, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ వనజ, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలి దేముడు, జలవనరుల శాఖ ఎస్ఈ ఉమా మహేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జిల్లా డబ్ల్యూయూ ఎస్ఈ సురేష్, డీపీవో శ్రీదేవి, డ్వామా పీడీ ఉమాదేవి, నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యామసుందర్, తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఎస్‌సీడీసీఎల్ ఎస్ఈ విజయకుమార్, జిల్లా ప్రణాళిక అధికారి శేషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెనందిపాడు, సెప్టెంబరు 12: మహిళలు ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకునేందుకు కుట్టుమిషన్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్ర, ఉత్తర అమెరికా తెలుగు సంఘం వారి సంయుక్తంగా నిర్వహించిన కుట్టుమిషన్ రెండో విడత శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు పాల్గొని మాట్లాడుతూ విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. పాలపర్రుకు చెందిన తేళ్ళ నారాయణ రైతు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారని ఈ కేంద్రానికి ఆయన పేరును నామకరణం చేయడం శుభపరిణామం అన్నారు. నాట్స్ డైరెక్టర్ మాదల రాజేంద్ర మాట్లాడుతూ నాట్స్ సంస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను, విద్యార్థులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన ఆరుగురు పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. దాత పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, జంపని రామారావులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, పారిశ్రామికవేత్త ముద్దన రాఘవయ్య, ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, జాకబ్, శిక్షకురాలు కె.లక్ష్మీ, కేంద్ర నిర్వహకులు దొప్పలపూడి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం

సివిల్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో నాట్స్ పూర్వపు అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి సహకారంతో రూపొందించిన ఐఏఎస్, సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాల పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ పుస్తకంలో అంశా ల్ని సివిల్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా రూపొందించారని, విద్యార్థులు దీనిని సద్వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాట్స్ డైరెక్టర్ మాదల రాజేంద్రచౌదరి, మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి, పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, సీపీఎం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, దొప్పలపూడి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ జి వీరరాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రతిపాదనలు

● పరిశీలనలో 232 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమి
● భూమిని పరిశీలించిన జిల్లా అధికారులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: పారిశ్రామికంగా ప్రత్తిపాడును అభివృద్ధి చేయడంతో పాటు నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నడుంబిగించారు. ఎన్నికల సమయంలో ఆయన ప్రత్తిపాడు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని మల్లాయపాలెం సమీపంలో ఉన్న సుమారు 232 ఎకరాల వక్ఫ్‌బోర్డుని గుర్తించారు. ఈ భూమిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని రాజధాని ప్రాంతంలో ప్రత్తిపాడు ఉండటంతో ఇక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తే నియోజకవర్గంతో పాటు రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించారు. అందులో భాగంగా ఎమ్మెల్యే రామాంజనేయులు అధికారులతో మాట్లాడటంతో పాటు అందుకు సంబంధించి దిశానిర్దేశాలను కూడా సూచించారు. ఆ దిశగా అడుగులు వేసేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే ప్రత్తిపాడు నుంచి నిమ్మగడ్డవారిపాలెం మీదగా కొత్తమల్లాయపాలెం వెళ్లే రహదారిలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూమిని సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, గుంటూరు జేసీ భార్గవ్ తేజ్‌లు గురువారం పరిశీలించారు. స్థానికంగా ఆ భూమిని సాగుచేస్తున్న రైతులతో మాట్లాడారు. ఈ క్రమంలో గుంటూరు జేసీ భార్గవ్ తేజ్ రైతులతో మాట్లాడుతూ ఈ భూమిపై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. తరువాత మీతో సంప్రదిస్తామని రైతులకు తెలిపారు. అలాగే వక్ఫ్ బోర్డు భూమి నుంచి నిమ్మగడ్డవారిపాలెం మీదుగా నాలుగు లైన్ల విస్తరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే గతంలో ఇదే భూమిలో తొలుత విమానాశ్రయం ఏర్పాటుకు, ఆ తరువాత గుంటూరు మార్కెట్ యార్డు కోసం ఈ స్థలాన్ని ప్రభుత్వం పరిశీలించింది. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, తహసీల్దార్ రవిబాబు, వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

● ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం అధికారులు వచ్చి రైతులతో మాట్లాడుతున్న విషయాలను వీడియో, ఫోటోలు తీస్తున్న విలేకరులపై సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్‌కు కోపం వచ్చింది. వెంటనే ఆ ఫోన్‌లలో ఉన్న డేటా మొత్తం డిలీట్ చేయాలంటూ తన సిబ్బందికి ఆదేశించారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది విలేకరుల ఫోన్‌లు తీసుకుని ఆ ఫోన్‌లలో ఉన్న డేటాను డిలేట్ చేసి ఫోన్‌లు తిరిగి ఇచ్చారు.

కరెన్సీ గణపతి



నాగులపాడు శ్రీరామయూత్ ఆధ్వర్యంలో కరెన్సీతో అలంకరించిన గణనాథుడు

పెదనందిపాడు, సెప్టెంబరు 12 : వినాయక నవరాత్రులు పురస్కరించుకొని పందిళ్లలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరులకు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఆరో రోజు విశేష అలంకరణలు చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నాగులపాడు శ్రీరామా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడుకి రు.49,49,499ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. కరెన్సీ గణపతిగా దర్శనమిస్తున్న గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆరు రోజులుగా విశేష పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. స్థానిక లయన్స్ మాంటిస్సోరీ సీబీఎస్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన గణనాథుడిని డప్పువాయిద్యాలతో ఊరేగించి నల్లమడ వాగులో నిమజ్జనం చేశారు.

ఐదు లక్షలతో వినాయకుడికి అలంకారం



తాడికొండ, సెప్టెంబరు 12: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా మోతడక గ్రామంలో వినాయకుడికి ఐదు లక్షల రూపాయల నగదుతో అలంకరించి పూజా కార్యక్రమాలను గురువారం చేపట్టారు. అనంతరం లడ్డూ వేలంపాట నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తీసుకువెళ్లారు.

కాకుమాను, సెప్టెంబరు 12: పలు గ్రామాల్లో ఐదు రోజుల నుంచి ప్రత్యేక పూజలందుకున్న వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా జరుగుతున్నాయి. కాకుమాను శివాలయంలో ఉంచిన చవితి వినాయకుడి నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు.

సీతారాం ఏచూరికి నివాళులు..



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెదనందిపాడు, సెప్టెంబరు 12 : స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో చెన్నుపాటి వెంకటసుబ్బయ్య మీటింగ్ హాల్లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు, దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, సెప్టెంబరు 12: పేద, బడుగు బలహీన వర్గాల తరపున పోరాడిన వ్యక్తి సీతారామ్ ఏచూరి అని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు అన్నారు. ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

దుగ్గిరాల, సెప్టెంబరు 12: స్థానిక సీపీఎం కార్యాలయంలో సీతారామ్ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల సీపీఎం కార్యదర్శి జెట్టి బాలరాజు, యేమినేని స్టాలిన్, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, మన్నవ నరసింహారావు, గొరైపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్‌ల విగ్రహ నిమజ్జనం

తుళ్లూరు, సెప్టెంబరు 12: శాఖమూరు, నేలపాడు, తుళ్లూరులో విఘ్నేశ్వరుల నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. శాఖమూరులో శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు గణేషుని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం సభ్యులు ఆర్థల సదాశివరావు, మద్ది బాలజీ శివనాగరాజు, మైలా సాంబయ్య, చిన్న కృష్ణ యాదవయూత్ సభ్యులు పాల్గొన్నారు.



శాఖమూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న సభ్యులు

అమరావతిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందాలు

● టిడ్కో ఇళ్లు, కొండవీటివాగు పరిశీలన
● రైతులు, డ్వాక్రా మహిళలతో మాటామంతీ



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రపంచబ్యాంకు సభ్యులు, సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, సెప్టెంబరు 12: రాజధాని అమరావతిలో వరల్డ్ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) బృందాలు గురువారం పర్యటించాయి. ముందుగా తుళ్లూరులోని టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలించాయి. అనంతరం వారు మందడంలో డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. వారి జీవన ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వెంకటపాలెంలో రైతులతో సంభాషించారు. అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్టు వారికి తెలియజేశారు. అమరావతిలో వరద ప్రభావం ఎప్పుడూ లేదని.. మొన్న వచ్చిన వరద కూడా రాజధానిని తాకలేదని రైతులు వివరించారు. వందేళ్లలో ఈ ప్రాంతం ఎప్పుడూ వరద కారణంగా ఇబ్బంది పడింది లేదన్నారు. రాయపూడి రెవెన్యూలో నిర్మించిన ఎమ్మెల్యే భవనాలను బృందాలు పరిశీలించాయి. తర్వాత ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న కొండవీటి వాగు ఎత్తిపోతల పథకాన్ని చూశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల బృందాల సభ్యులు వర్మ, ఎస్‌వీఎన్ రావు, సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్

తాడికొండ, సెప్టెంబరు 12: ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన ఆక్రమణలు వెలుగు లోకి వస్తున్నాయి. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్ర మించుకున్నారనే నేపథ్యంలో కంతేరు పంచాయతీ కార్య దర్శి ఎన్ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో విషయం బయటకు వచ్చింది. మండలంలోని కంతేరు గ్రామంలో కర్రి ప్రసాద్, కర్రి మరియమ్మలు 15.42 సెంట్ల భూమికి నకిలీ పత్రాలు సృష్టించి గురజాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2018 జూన్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సదరు స్థలంలో నాలుగు షాపులు, ఇంటి నిర్మాణం చేసి అద్దెలకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. అప్పటి పంచాయతీ కార్యదర్శితో కలిసి ఇంటి పన్నులు వేయించారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేపట్టారని తెలియటంతో తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించి సర్వే చేయించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు కందిపప్పు వితరణ

తాడేపల్లి, సెప్టెంబరు 12: వడ్డేశ్వరం గ్రామంలోని 7 అంగన్‌వాడీ సెంటర్లకు టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు 21 కేజీల కందిపప్పును వితరణ చేశారు. గురువారం గ్రామంలోని 7 అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి ఇబ్బందులు తెలుసుకుని పిల్లల పౌష్టికాహారానికి సంబంధించి నిత్యం అవసరమైన కందిపప్పును ఏడు సెంటర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కాట్రగడ్డ మధుసూదనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, వడ్డేశ్వరం రాజారావు, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ శిరోమణి, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక నేతలు చావలి సురేష్, ఇమాంసా, జానీ, వడ్డేశ్వరం ప్రసాద్, మస్తాన్, అబ్దుల్ కపూర్, మస్తాన్‌బీ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న, శ్రీనివాసరావు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

● తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 12: పట్టణంలో మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందామని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్, సాయిబాబా గుడి రహదారుల డివైడర్ల మధ్యలో గురువారం మున్సిపల్ అధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు తెనాలి సుందరీకరణలో భాగంగా మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. పట్టణంలో వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీ.శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏఈ శేషుబాబు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ అధికారులను కహిషనర్ శేషన్న ఆదేశించారు. స్థానిక బాలాజీరావుపేటలోని 33వ వార్డులో గురువారం పారిశుధ్య పనులను కమిషనర్ దగ్గరుండి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తెనాలి సుందరీకరణలో భాగంగా పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, డ్రెయిన్‌లు, మురుగు కాలువలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పట్టణ ప్రజలు రెండు బుట్టల విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీ.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జైన్‌టెంపుల్ వీధిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు

వేడుకగా గణనాథుడి నిమజ్జనం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 12: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయక చవితి మండపాలలో ఐదో రోజైన బుధవారం రాత్రి గణేషునికి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పలు విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్థానిక జైన్ టెంపుల్ వీధిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడవి వినాయకుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిమజ్జనంలో ఏర్పాటు చేసిన వీరభద్రుని ఖడ్గాలు, వారు చేసిన నారసాల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. నాజరుపేటలోని సుగాలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలలో మహిళలు నృత్యం చేశారు. వివిధ మండపాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రాహాలను సంగంజాగర్లమూడి వద్ద కొమ్మూరు కాలువలో నిమజ్జనం చేశారు.

జైన్‌టెంపుల్ వీధిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డుని వేలంలో పింటు జైన్ రూ. 1.11 లక్షలకు సొంతం చేసుకున్నారు. యూత్ సభ్యులు బూర్లగడ్డ గోపాలరావు, బి చైతన్య, నటరాజ్, ఉమ, పండులు లడ్డు ప్రసాదాన్ని పింటు జైన్‌కు అందజేశారు.

తెనాలి రూరల్: మండలంలోని జగ్గడిగుంటపాలెం ప్రగఢ కోటయ్య నగర్‌లోని పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద లడ్డూ వేలం నిర్వహించగా రాచాబత్తుని విజయ్‌కుమార్ రూ.1 లక్ష 36 వేలుకు దక్కించుకున్నాడు.

తెనాలి అర్బన్: నందులపేట బాలగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 9వ గణపతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం భక్తులకు అన్నదానం అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. స్వామివారిని అలంకరించిన వాహనంపై పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ప్రసాద్, మహిధర్, నల్లయ్య, బసవేశ్వరరావు, గోపికృష్ణ, భరత్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కొల్లిపరలో వినాయక విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కొల్లిపర: మండలంలోని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు రోజుకొక విధంగా పందిళ్లను అలంకరిస్తూ వేడుకలను చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్నంగి, కొల్లిపర, తూములూరు, దావులూరు, అత్తోట గ్రామాల్లో గణనాథుడిని వివిధ రూపాల్లో అలంకరించి పండితులు పూజలు చేశారు. ప్రధాన కూడళ్ల దేవస్థానాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద భజన సంకీర్తనలు ఆలపిస్తున్నారు. పూజలు చేసిన అనంతరం గ్రామాల్లో భక్తులు అన్నదానం నిర్వహించారు. వల్లభాపురం, మున్నంగి, తూములూరు, చక్రాయపాలెం, కొల్లిపర తదితర గ్రామాల్లో కొంత మంది భక్తులు వినాయక విగ్రహాలకు పూజలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో, కనకతప్పెట్లుతో ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

చిన్నారులకు వరం బాలామృతం

తెనాలిరూరల్, సెప్టెంబరు 12: అంగన్‌వాడీల ద్వారా అందించే బాలామృతం చిన్నారులకు వరమని, ప్రతి రోజు పిల్లలకు బాలామృతాన్ని అందిస్తే వారిలో రోగనిరోధకశక్తి పెరగడంతో పాటు మంచి ఆరోగ్యవంతులుగా తయారవుతారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సెక్టార్ వన్‌సూపర్ వైజర్ కె.సౌజన్యశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని ఐతానగర్ అంగన్‌వాడీ 39వ వార్డుకేంద్రంలో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ.. 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం అందించడం ద్వారా పోషకాహార లోపాలు తలెత్తకుండా మంచి ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు తృణదాన్యాలతో కూడిన ఆహారం, తాజా ఆకుకూరలు, పండ్లు క్రమంతప్పకుండా తీసుకుంటూ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తాము చెప్పె సూచలు పాటిస్తే మంచి ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపవచ్చని సుచిత్ర తెలిపారు. కార్యక్రమంలో రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ గుంటూరు టీమ్ సభ్యుడు వాకా లక్ష్మణ్‌నందన్, మహిళాపోలీస్ సౌదామిని, ఏఎన్‌ఎం జి. నాగమల్లేశ్వరి, పూజ, అంన్వాడీ కార్యకర్త ఎల్జిబెత్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపు ఉద్రిక్తం..

● టీడీపీ శ్రేణులపై వైసీపీ వర్గీయుల రాళ్ల దాడి

పెదకాకాని, సెప్టెంబరు12: పెదకాకాని మండల పరిధిలోని అనుమర్లపూడి గ్రామంలో గురువారం గణేషుని నిమజ్జనం కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణేషుని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విగ్రహాన్ని ఊరేగింపుగా శేకూరు మీదుగా తీసుకువచ్చి సంగం జాగర్ల మూడి లాకుల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ మధ్యలో ఊరేగింపు అను మర్లపూడి గ్రామ పంచాయతీ వద్దకు రాగానే రోడ్డు పక్కన గల ఓ డాబా మీద నుంచి వైసీపీకి చెందిన వారు కొందరు ఊరేగింపుపై రాళ్లు విసిరారు. ఈ దాడిలో ఓచిన్నారి సహా, ముగ్గురికి గాయాలయ్యాయి. అయితే ఈ కార్యక్రమంలో గొడవలు జరుగుతాయని భావించే పోలీసులు ముందస్తుగా భద్రతా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ పోలీసుల సమక్షంలో వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. గాయపడిన రేకా సాంబశివరావు, అనగాని శ్రీనివాసరావు, గుంపెన సాంబశివరావులు చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వాస్పత్రిలో చేరారు.

అపార నష్టం.. రైతుకి కష్టం

● ప్రకృతి వైపరీత్యాలకు తల్లడిల్లుతున్న రైతులు
● నియోజకవర్గంలో 35 వేల ఎకరాలో వరి పంట నష్టం
● నిండా ముంచిన మురుగు కాల్వలు
● ప్రభుత్వమే ఆదుకోవాలని ఎదురుచూపు




వెల్లలూరు వద్ద పంట పొలాలను వీడని వరద ముంపు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు12: పొన్నూరు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 35 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. రైతులకు అపార నష్టాలను మిగిల్చింది. జిల్లాలో కాల్వ చివరి భూములు పొన్నూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. పంటల సాగు ప్రారంభంలో సాగు నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేసే రైతులు.. సాగు అనంతరం పంట చేతికొచ్చే సమాయానికి ప్రకృతి వైపరీత్యాల ధాటికి తీవ్రంగా నష్టపోతున్నారు.

35 వేల ఎకరాలో వరి పంట నష్టం..

పొన్నూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో కురిసన అధిక వర్షాలకు 35 వేల ఎకరాలో వరి పంట వరద ముంపుకు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వరద ముంపు తొలుగుతుండటంతో అధికారులు పంట నష్ట లెక్కింపును చేపడుతున్నారు.



నీటిలో నానుతున్న వరి

పెదకాకాని మండలంలో అనమర్లపూడి, తంగెళ్లమూడి, డీబీ పాలెం, వెంకట కృష్ణపురం, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు, గొళ్లమూడి, నంబూరు గ్రామాల్లో పది వేల ఎకరాలో వరి పంట దెబ్బతింది. చేబ్రోలు మండలంలలో శేకూరు, వీరనాయకుపాలెం, సుద్ధపల్లి, శలపాడు, వేజండ్ల, మంచాల, శ్రీరంగపురం గ్రామాలు వరద పోటుకు గురై పది వేల ఎకరాలో పంట నష్టం జరిగింది. పొన్నూరు మండలంలలో వెల్లలూరు, బ్రహ్మణకోడూరు, జూపూడి, మన్నవ, గోళ్లమూడిపాడు, దొప్పలపూడి, మునిపల్లె, పచ్చలతాడిపర్రు, కొండమూది, జడవలి గ్రామాల్లో 10 వేల ఎకరాలో వరి పైరు దెబ్బతింది. పది రోజులు కావస్తున్నప్పటికి ఇంకా వరద నీటిలోనే పైరు నానుతుంది. దీంతో వరి ఓదెలు కుల్లిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. భూ యజమానులైన రైతుల పరిస్థితి ఒకలా ఉంటే కౌలు రైతుల కష్టం మరీ దారుణంగా ఉంది.

మండలంలో ఖరీఫ్‌లో వరి పంట రబీలో మొక్కజొన్న సాగుతో అప్పుల ఊబిలో నుంచి బయటకు రావచ్చనే ఆశతో కౌలు చెల్లించి సాగు ప్రాంభించిన కౌలురైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. వర్షాల దాటికి పంట వరద పాలవడంతో ఏమి పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కౌలు కాకుండా ఎకరానికి ఇప్పటికే సుమారు.15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వీటికి తోడు కౌలు రూపంలో ఎకరానికి రూ. 20 వేల నుంచి 30 వేల వరకు రైతులు చెల్లించారు. ఖరీఫ్‌లో పంట కోల్పోవటంతో పెట్టిన పెట్టుబడి ఖర్చుకు తోడు అప్పులకు వడ్డీలు భారమై కూర్చున్నాయి. దీంతో కౌలుదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ముంచేసిన మురుగు కాల్వలు..

పొన్నూరు నియోజకవర్గంలో రైతులను మురుగు కాల్వలే ముంచేసాయని రైతులు వాపోతున్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలంలో గుంటూరు ఛానల్, నల్లడ్రయిన్లకు గండ్లు పడి 10 వేల ఎకరాలో పంట నష్టం వాటిల్లింది. చేబ్రోలు మండలంలో నల్లమడ డ్రెయిన్, అప్పాపురం ఛానల్‌కు గండ్లు పడి పది వేల ఎకరాలో పంటలు దెబ్బతిన్నాయి. పొన్నూరు మండలంలో అనేక గ్రామాల్లో మురుగు కాల్వలు పైనుంచి వచ్చిన వరద నీరు పంట పొలాలను ముంచెత్తాయి. గత ఐదేళ్లుగా సాగు నీటి సంఘాలులేక పోవటం, పాలకులు అధికారులు కాల్వల మరమ్మతులు చేపట్టక పోవడంతో ఈ దుస్థితి దాపరించిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కాల్వల మరమ్మతలపై దృష్టి పెట్టినప్పటికి అప్పటికే ఖరీఫ్ పంటల సాగు ప్రారంభం కావటంతో కాల్వల మరమ్మతులు నిర్వహించలేకపోయారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్య ధోరణే రైతులకు పెను నష్టాలను మిగిల్చాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



వరద ముంపు తర్వాత మునిపల్లెలో పూర్తిగా పాడైపోయిన వరి పైరు



డంపింగ్ యార్డ్ వద్ద రోడ్డు పక్కన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దుతాం

● పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు12: పొన్నూరు పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు తెలిపారు. గురువారం పొన్నూరు పట్టణంలోని డంపింగ్ యార్డును కమిషనర్ పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు డంపింగ్ యార్డు సమీపంలోని రోడ్డుల మార్జిన్ల వెంట వేసిన చెత్త చెదారాలను పరిశీలించి తక్షణమే వ్యర్థాలను డంపింగ్ యార్డులోకి తరళించే చర్యలను చెప్పట్టారు. అలాగే 15వ వార్డులో పర్యటించి రోడు వెంట నిల్వ చేసిన చెత్త చెద్దారాలను పరిశీలించి పారిశుధ్య కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే రోడ్ల వెంట చెత్త చెదారాలను తొలగించాలని ఆదేశించారు. ప్రజలు కూడా రహదారుల వెంట చెత్త చెదారాలను విడిచి పెట్టవద్దని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్, కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేసి పరిసరాల శుభ్రతపై పలు సూచనలు ఇచ్చారు. పట్టణంలోని సినిమా హాలను తనిఖీ చేసి సినిమా హాల్లో పరిశుధ్యంపై పలు సూచనలు చేసారు.



కొల్లూరు మండలం ఈపూరులంక గ్రామంలోని వరద బాధితులకు అల్లని ఆంధ్ర అసోసియేషన్, రెయిన్‌బోట్రస్ట్ తెనాలి అండగా నిలిచాయి. గురువారం ఆ గ్రామంలోని బాధితులకు ఇంటింటికి తిరుగుతూ డాక్టర్ జీవన్‌లత, ట్రస్ట్ సభ్యులు 10 రోజులకు సరిపడా నిత్యావసరాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. - **తెనాలి రూరల్**

14న పద్మశాలీ ఉద్యోగ సంఘ సమావేశం

● హాజరుకానున్న పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 12 : పద్మశాలీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ సమావేశం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగే మూడవ వార్షికోత్సవ సభలో విశిష్ట అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీలు పి.అనూరాధ, ఎం.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గౌర వ అతిధులు ఐటి శాఖ జాయింట్ కమిషనర్ కోటేశ్వరి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, దూరదర్శన్ ఉపసంచాలకులు కొండలరావు, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుబ్బలక్ష్మి, జి.రవిచంద్ర, శాంతి, తమిళనాడు హ్యాండ్‌లూమ్స్ అధినేత రామచంద్రన్ పాల్గొని ప్రసంగిస్తారు. ఆత్మీయ అతిధులుగా ఆప్కో మాజీ చైర్మన్లు చిరంజీవి, మోహనరావు, పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, రాష్ట అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగదీష్, పద్మశాలీ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, ఏపీపీఎస్ ఉపాధ్యక్షుడు నరసింహులు పాల్గొంటారని సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన 2వ పట్టణ సీఐ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 12 : తెనాలి 2వ పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా షేక్ మహ్మద్ నజీర్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ప్రత్యేకదృష్టి సారించాలని, మహిళల కేసులో శ్రద్ధ పెడతామని తెలిపారు. అసాంఘిక శక్తులపై కఠినచర్యలు తప్పవని గంజాయి విక్రయాలు, జూదంపై ఉక్కుపాదం మోపుతామన్నారు.



బాధ్యతలు స్వీకరించిన సీఐ నజీర్‌బాషా

కుటుంబ సంబంధాలపై లఘు చిత్రాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 12 : పట్టణానికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో కుటుంబ బంధాలు, మానవీయ విలువలపై లఘు చిత్రాలు నిర్మిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిలక్ష్మిరాజు తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, యూట్యూబ్ ఛానల్‌లో స్వరలయ స్టూడియోస్ ద్వారా ఈ చిత్రాలు విడుదల చేస్తామన్నారు. లఘు చిత్రాలు చూసి అభిప్రాయాలను కామెంట్ బాక్సులో పోస్టు చేయాలని ఉత్తమ సూచనలు చేసే మహిళలకు గృహోపకరణాల వస్తువులు ముగ్గురికి అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలి

● కేంద్ర బృందానికి సీపీఎం నేతల వినతి

పెదకాకాని, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వలన జిల్లాలో లక్ష ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని ఆయా రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లాలో పంట నష్టం అంచనా పరిశీలను కోసం వచ్చిన కేంద్ర బృందాన్ని పెదకాకాని మండలంలోని గుంటూరు ఛానల్ వద్ద కలిసి సీపీఎం నేతలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, నిమ్మ, తమలపాకులు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన పంటలకు కౌలుతో సహా ఇప్పటికే 2 లక్షలు, వరికి రూ.70 వేలు ఖర్చు చేశారన్నారు. పంటలన్నీ నీట మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో వున్నారన్నారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.లక్ష, వరికి రూ.30 వేలు నష్టపరిహారం అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10వేలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కేంద్ర బృందం పంట నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించి రాష్ట్రానికి రూ. 10 వేల కోట్లు వరద సహాయాన్ని ఇప్పించాలని కోరారు. పంట కాల్వలు గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, నల్లమడవాగుకు అనేక చోట్ల గండ్లు పడ్డాయని, చెరువులు తెగిపోయాయని యుద్ధ ప్రాతిపదికన గండ్లు పూడ్చాలని కోరారు. పంట కాల్వల నిర్వహణ సక్రమంగా లేదని, కాల్వల్లో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క తీసే నాధుడే లేరని, చిన్న వర్షం వచ్చినా నీరంతా పొలాలపై ప్రవహిస్తుందన్నారు. కాల్వల నిర్వహణ, మరమ్మతులకు సిబ్బందిని, నిధులను సమకూర్చాలని కోరారు.



కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతరం కలెక్టర్ నాగలక్ష్మీ కేంద్ర బృందానికి సమస్యలను వివరంగా తెలియజేశారు. కేంద్ర బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి నన్నపనేని శివాజీ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు జొన్నా శివశం కర్, బైరగాని శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, కె.సత్యనారాయణ, వెంకటరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.

దూర విద్యలో ప్రవేశానికి ఆహ్వానం

● 15 లోగా దరఖాస్తు చేసుకోవాలి : ఎంఈవో

పొన్నూరుటౌన్, సెప్టెంబరు12 : బడి బయట ఉండే 14 సంవత్సరాలు దాటిన వారికి దూర విద్య ద్వారా 10వ తరగతి, 15 సంవత్సరాలు నిండిన వారికి ఇంటర్మీడియట్ చదివే అవకాశం ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంఈవో కార్యాలయంలో అన్ని పాఠశాల యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 15వ తేదీ లోగా అర్హత కలిగిన విద్యార్థులు ఓపెన్ విద్యాభ్యాసానికి అడ్మిషన్లు చేసుకోవచ్చని సూచించారు. సెలవు రోజులో వీరికి ఏపీ హైస్కూల్‌లో ముఖాముఖి తరగతులు జరుగుతాయని, మధ్యలో బడి మానేసిన విద్యార్థులు, పదోవ తరగతి తర్వాత చదువు ఆపేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

చేబ్రోలు, సెప్టెంబరు 12: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించటం ద్వారా పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు తెలిపారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం నారాకోడూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యక్తిగత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పాఠశాల్లో డెటాల్ హైజిన్ కార్నర్, సోప్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసారు. భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులు సుభ్రంగా కడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీ నలిని, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్ రాజ్‌కుమార్, డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.